కథ

# జనరాజ్యం - జిందాబాద్

**కోపూరి పుష్పదేవి**

"ఇంకా ఎంతదూరం?" అడిగాడు ఆయన. ఏసీ కారులో ప్రయాణించినా అలసిపోయినట్లుగా ఉంది ఆ గొంతు.

"ఇదిగో సార్ వచ్చేశాము. మరొక్క పది కిలోమీటర్లు మాత్రమే" అన్నాడు వినయంగా డ్రైవరు.

దగ్గరకు వచ్చామనగానే ఆ ప్రదేశం మీద ఆసక్తి పెరిగిన ఆయన విండోగ్లాసుల్లోంచి చుట్టు పక్కల ప్రదేశాలను పరిశీలనగా చూడసాగాడు. ఏవేవో పిచ్చి మొక్కలూ, అక్కడక్కడా నాలుగు తాడిచెట్లూ తప్ప కనుచూపు మేరలో ఎక్కడా పచ్చని చెట్టు అనేది కనబడలేదు. ఆ ప్రదేశం అంతా చిన్న చిన్న కొండగుట్టలతో బండరాళ్ళతో నిండి ఉంది. ఆయనకు గుర్తు వచ్చింది తాము ప్రయాణం చేసిన ఈ నాలుగు గంటల్లో చాలా రోడ్డు వంతెనలు దాటాము కానీ, ఏ వంతెన కిందా దోసెడు నీరు లేదు. అంతా ఎడారిలాగా ఉన్నది.

వరుసగా ఆరు అంబాసిడర్లు, నాలుగు సుమోలు, మూడు క్వాలిస్‌లు ఎర్రటి ఎండలో దుమ్మురేపుకుంటూ ఆ గ్రామంలో ప్రవేశించాయి. తూరుపు వీధిలో సరాసరి వెళ్ళి, పాడుబడినట్లున్న రామాలయం దాటి ఎడమ వేపుకి మళ్ళాయి.

"ఇదేమిటి... కాన్వాయి లాగా ఈ కార్లేమిటి....? మన ఊరికి చెప్పా పెట్టకుండా ఎవరైనా మంత్రిగారు వచ్చారా ఏమిటి కొంపదీసి మన బతుకులు బాగుచెయ్య డానికి...?" కాస్తో కూస్తో లోకజ్ఞానం ఉన్న ఒక పెద్దాయన కార్ల శబ్దానికి ఇంట్లోనుంచి బయటకు వచ్చి ఎదురెండ కళ్ళల్లో సడకుండా కళ్ళకు చెయ్యి అడ్డంగా పెట్టుకుని చూస్తూ అనుకున్నాడు. వంటి మీద చిన్న లాగు మాత్రమే వేసుకున్న పిల్లలు కొందరు ఆ కార్ల వెనుక కొంతదూరం పరుగెత్తారు. పరుగెత్తని కొందరు పిల్లలు పదకొండూ, పన్నెండూ, పదమూడు అంటూ కార్లను లెక్కపెట్టారు. ముసలీ, ముతకా, లేవలేని వాళ్ళు కూడా ఆ వింత చూడటానికి పూరి పాకల్లోంచీ, పెంకుటిళ్ళలోనుంచీ బయటకు వచ్చి నిలబడ్డారు. ఎవరొస్తున్నారో.... ఏమిటో.... అనుకుంటూ."

"ఏమిటండీ మేష్టారూ, ఏమిటీ హడావుడి? ఈ కార్లూ, జనం... మీకేమన్నా తెలుసా..." ఆరాటం పట్టలేక పక్కన పడిపోబోయేట్లున్న మట్టి మిద్దెలోని కాంతారావుగారిని అడిగాడు పెద్దాయన. కాంతారావుగారు పదేళ్ళ క్రితం రిటయిరైన స్కూలు టీచరు. అలవాటు ప్రకారం అందరూ ఆయన్ని మాష్టారూ అనే అంటారు.

"అయ్యో.... నీకింకా తెలియదా పెద్దయ్యా.... మన ఊరిని ప్రముఖ నటుడు బాలరవి దత్తతకు తీసుకున్నాడు. ఆయన సినిమా నటుడిగా ఎన్నో కోట్లు సంపాదించాడుగదా.... ఇప్పుడు ప్రజలకు ఏమన్నా మేలు చేసి ఋణం తీర్చుకోవాలని సద్బుద్ధి పుట్టినట్లుంది. ఎన్నో ఏళ్ళుగా వర్షాలు కురవక, వాగులు వంకలు ఎండిపోయి, పొలాలన్నీ బీళ్ళయిపోయి, తినడానికి తిండిలేక, తాగడానికి నీరులేక ఊరిజనం అంతా వలసలు పోయి శ్మశానంలా మిగిలిన మన ఊరిపై ఆ మహానుభావుడి దృష్టి పడింది. తనకున్న సిరిసంపదలలో కొంత ఖర్చుపెట్టి ఊరిని తిరిగి సస్యశ్యామలం చేస్తానని కంకణం కట్టుకున్నాడు. ఆ లక్ష్మీదేవి కరుణిస్తే సాధించలేనిది ఏముంది...? మన ఊరికీ, ఇంకా మనకందరికీ మంచి కాలం వచ్చింది పెద్దయ్యా.... పొట్టచేత బుచ్చుకుని దేశాలవెంట పోయిన మన బిడ్డలు మళ్ళీ వచ్చేస్తారు. మన ఊరు మళ్ళీ పాడిపంటలతో కళకళ లాడుతుంది పెద్దయ్యా.... ఆ ధర్మాత్ముణ్ణి చూడటానికే ఇప్పుడు నేను వెళ్తున్నాను. నువ్వు కూడా వస్తావా పెద్దయ్యా...?"

"ఎంత మంచి కబురు చెప్పావయ్యా.... నా చెవుల్లో అమృతం పోసినట్లుందనుకో.... బాబ్బాబూ నీకు పుణ్యం ఉంటుంది నన్ను కూడా తీసుకెళ్ళు. ఆ దయామయుణ్ణి చూసి జన్మ ధన్యం చేసుకుంటాను" పడుతూ లేస్తూ మాష్టారి వెంట బయలు దేరాడు పెద్దయ్య.

వీళ్లు వెళ్ళేసరికి బాలరవిగారూ, కరణం, మునసబు, పంచాయితీ బోర్డు ప్రెసిడెంటూ, మరి నలుగురయిదుగురు పెద్దమనుషులు అందరూ కరణం గారి విశాలమైన చావిట్లో కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

పొలాల్లో బోర్లు వెయ్యాలనీ, ఆ గంగమ్మ తల్లిని వెలికి తెచ్చి పంటచేలు తిరిగి కళకళలాడించాలనీ మగవాళ్ళు నిర్ణయానికి వచ్చారు.

"మరి మా నంగతో.... త్రాగడానికి గుక్కెడు నీళ్ళు కూడా దొరకడం లేదు. మంచి నీళ్ళ కోసం మూడుమైళ్ళు నడవలేక అల్లాడుతున్నాం. మా కోసం పడమటి వీధిలో ఒకటీ, తూర్పు వీధిలో ఒకటీ బావులు తవ్వించం డయ్యా...." ఆడవాళ్ళు అర్జీ పెట్టుకున్నారు.

"అలాగే, అలాగే.... తప్పకుండా తవ్విద్దాం. ఇంకా ఏంకావాలో అడగండి" చిరునవ్వుతో అభయ మిచ్చాడు బాలరవి.

"పూడిపోయిన పెద్దచెరువు పూడిక తీయించాలయ్యా.... పని పాటలకూ, పశువులకూ కూడా చాలా అవసరం" అన్నాడు మునసబు.

"అలాగే.... గ్రాంటెడ్"

"కూలిపోయిన స్కూలు గదులకు రిపేర్ చేయించాలయ్యా" అడిగాడు బడిపంతులు

"తప్పకుండా....తప్పకుండా... ఇంకా"

"పాడు బడిపోయిన రామాలయాన్ని పునరుద్ధరించండయ్యా" పూజారి

ప్రాధేయ పడ్డాడు.

"అలాగే చేద్దాం... అలాగే చేద్దాం...." అందరికీ నమస్కరించి కుర్చీలోంచి లేచాడు బాలరవి.

❀❀❀

"బాలరవి గారికీ జై.... బాలరవి గారికీ జై..... మా గ్రామాలను ఉద్ధరించిన దేముడు బాలరవి గారు వర్ధిల్లాలి... కలియుగ దేముడు బాలరవి గారు వర్ధిల్లాలి..." జనమంతా ఆనందోత్సాహాలతో బాలరవిని భూజాలమీద కెత్తుకుని చిందులేస్తున్నారు.

"అయ్యో.... అయ్యో.... పడిపోతారేమో ఆయన.... దించండి.... దించండి" పెద్దగా అరిచింది బాలరవి భార్య శ్రీలేఖ.

"ఏమిటమ్మా... కలవరిస్తున్నావు..... కలేదైనా వచ్చిందా" అడిగాడు పక్కమంచంమీద పడుకున్న కొడుకు శివచరణ్ లేచి మంచినీళ్ళు తల్లికి అందిస్తూ.

"అబ్బ.... ఎంత మంచి కల వచ్చిందనుకున్నావు.... మీ నాన్న ఈ రొచ్చు రాజకీయాల్లోకి దిగకుండా సంపాదించిన సొమ్ముని పేద ప్రజల కోసం ఖర్చు పెడుతున్నారట... ప్రజలంతా ఆయన్ని దేముడిలాగా కొలుస్తూ బ్రహ్మరధం పడుతున్నారట..."



జనవరి 22న కవిసమయం ఆధ్వర్యంలో హైదరాబాదు ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సభలో కె.పి.అశోక్‌కుమార్ రచించిన "కథావలోకనం" గ్రంధాన్ని ఆవిష్కరిస్తున్న మునిపల్లెరాజు. చిత్రంలో ఎ.కె.ప్రభాకర్, పోరంకి దక్షిణామూర్తి అంపశయ్యనవీన్, గుడిపాటి, గ్రంథకర్త ఉన్నారు.

## మరింత తాజాగా....

**జీ**విత కాలం ప్రేమార్తిని
శమింపజేయటం ఎవరితరం?
ఎడారి బాటసారికి
చిరునవ్వులే ఒయాసిస్‌లు
ఓ మాట ఓ చూపు చాలు
దారంతా కన్నీటితో కడగటానికి
శిశిరాను భవంలోంచి పల్లవించటానికి
మరో జన్మకోసం ఎదురు చూడటానికి...

పరిచయాలు పదిలమే!
అనుభవాలు ఆకాశంలో చుక్కలే!
గతం గుబుళ్ళ పొదే... అయినా
నచ్చిన తలపే ఓ అరవిరిసిన గులాబీ
మరి రేకలు రాలేదాకా
రోజూ మరింత తాజాగా విరబూస్తూ....

**డా॥సి.భవానీదేవి**

స్వగృహ ఫుడ్స్
Swagruha® Foods
Opp : P.W.D. Grounds, M.G. Road, VIJAYAWADA - 10
Phone : 2475763, Fax : 0866 - 2480200.
Eluru Road (Canara Bank Building).
Near Vijaya Talkies, Vijayawada - 520 002. Ph : 6626263.
10/2, Arundelpet, Guntur - 522 002. Ph : 2235350.
Visit us : www.swagruhafoods.net